క్లుప్తంగా

విజయదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గ అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం నిర్వహించి కంకుమ పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలితా, విష్ణు సహస్ర నామాలు పారాయణం చేయించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

పెదపూడి: సంక్షేమ పథకాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని దీనికి అనుగుణంగా అధికారులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. పారిశుధ్య పనుల్లో అలసత్వం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మునగాలలో రెవెన్యూ గ్రామసభ

మధురపూడి: కోరుకొండ మండలం మునగాల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సుస్వాగతం మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం నిమిత్తం చేపట్టిన ఈ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే మండలంలోని వివిధ గ్రామాల్లో పూర్తి చేశామన్నారు.


శివాలయాలకు భక్తుల తాకిడి



చంద్రేడులో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి

రంగంపేట: కార్తిక మాసం తొలి శుక్రవారం పురస్కరించుకొని గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం మొదటి శుక్రవారం పురస్కరించుకొని ఉదయం 4 గంటల నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో అర్చకుడు మైలవరపు కృష్ణ ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై దీపాలు వెలిగించి స్వామి వారిని దర్శించుకున్నారు. మండలంలోని వడిశలేరు, పెదరాయవరం, సింగంపల్లి, సుభద్రంపేట, ముకుందవరం, జి.దొంతమూరు గ్రామాల్లోని పురాతన శివాలయాల్లో కార్తిక మాసం తొలి శుక్రవారం పూజలు చేశారు.

నాణ్యమైన విద్యుత్‌కు చర్యలు



రాజానగరంలో 11 కేవీ ఫీడర్‌పై మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

రాజానగరం: విద్యుత్ అంతరాయాలను తొలగించి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి రాజానగరం, కానవరం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్లపై శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. రాజానగరం మెయిన్ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి కలచవర్ల, నందరాడ, మల్లంపూడి విద్యుత్ సబ్ స్టేషన్లకు కంబైన్డ్‌గా ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను ఆయా సబ్‌స్టేషన్ల వారీగా వేరు చేస్తున్నారు. గతంలో ఉన్న విద్యుత్ స్తంభాల ఎత్తు తక్కువగా ఉండటం వల్ల భారీ వాహనాలు వెళ్లే సమయంలో ఏర్పడుతున్న సమస్యలను కూడా దృష్టిలో పెట్టుకుని ఎత్తయిన స్తంభాలను పొక్లెయినర్ సాయంతో ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

వారధి.. ఎప్పుడయ్యేది?

- నత్తనడకన మునగాల వంతెన నిర్మాణం
- ప్రజలకు తప్పని ప్రయాణ కష్టాలు



కాపవరం - మునగాల మధ్య తోట కాలువపై నిర్మాణ దశలో ఉన్న వంతెన



కాపవరం-మునగాల మధ్య తోట కాలువ

మధురపూడి: 'బంధం' తెగింది.. అవునండి నిజమే. రెండు మార్గాలను కలిపే వారధి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ప్రజా రవాణాకు బ్రేక్ పడింది. కోరుకొండ- సీతానగరం మండలాలను కలిపేలా, దూరం దగ్గర చేసేలా మునగాల సమీపంలోని తోట కాలువపై వంతెనను మూడు దశాబ్దాల కిందట నిర్మించారు. ఈ మార్గం నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు, ప్రజలు వెళ్తుంటారు. ఆటోలు, బస్సులు, లారీలు కూడా వెళ్తుండేవి. తోట కాలువపై వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టినా పనులు మందకొడిగా సాగుతున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో కాపవరం నుంచి ముగ్గళ్ల వరకూ రోడ్డు విస్తరణకు రూ.30 కోట్లు కేటాయించారు. ఇందులో భాగంగా కాపవరం- మునగాల మధ్యలో తోట కాలువపై వంతెన, మునగాల దాటాక మరో వంతెన, ముగ్గళ్ల సమీపంలో వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. మునగాల దాటిన తర్వాత వంతెన పూర్తయ్యింది. తోట కాలువపై వంతెన పనులు ఇంకా కొలిక్కి రాలేదు. గత ప్రభుత్వంలో పనులు వేగంగా జరిగినా, తర్వాత ప్రభుత్వం మారడంతో నత్తనడకన సాగుతున్నాయి.

కాస్త శ్రద్ధ చూపితే..

కోరుకొండ, సీతానగరం మండలాల గ్రామాలకు అనుసంధానంగా మునగాల- ముగ్గళ్ల రోడ్డు ఉంది. ఇప్పు మునగాల వంతెన లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రెండు మండలాల్లోని ప్రజలకు సంబంధాలు తెగిపోయినట్లు అయ్యింది. కొత్త వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు శ్రద్ధ చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రోడ్డు నుంచి సీతానగరం మండలం మీదుగా గండి పోసమ్మ దేవస్థానానికి భక్తులు, గోదావరి పర్యాటకులు వెళ్తుండేవారు. అలాగే వ్యవసాయ ఉత్పత్తులు తరలించుకునేందుకు రైతులూ రాకపోకలు సాగిస్తుండేవారు. కొత్త వంతెన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని వారంతా కోరుతున్నారు.

చుట్టూ తిరగాల్సిందే..

ఈ వంతెన ఉండి ఉంటే కోరుకొండ నుంచి మునగాల మీదుగా సీతానగరం మండలం ముగ్గళ్లకు సులువుగా చేరుకోవచ్చు. ఇలా సుమారు 18 కిలోమీటర్లు ఉంటుంది. ఇప్పుడు ఈ వంతెన లేకపోవడంతో కోరుకొండ నుంచి శ్రీరంగపట్నం, మునగాల కొండ పక్క నుంచి ద్విచక్ర వాహనాలు, చిన్నకార్లు మాత్రమే వెళ్లేందుకు వీలుంది. ఇటుగా ముగ్గళ్ల వెళ్లాలంటే 23 కిలోమీటర్లు వస్తుంది. అయినా గాని ఇటుగా భారీ వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేదు. దీనితో పాటు వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రయాణం గండంలా మారింది. ఒకవేళ భారీ వాహనాలైతే శ్రీరంగపట్నం, కోటికేశవరం మీదుగా సీతానగరం చేరుకోవచ్చు. ఇలా సుమారు 30 కిలోమీటర్లు ఉంటుంది. వంతెనను వేగంగా నిర్మించి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి కాక కష్టాలు



కాపవరం- ముగ్గళ్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తోట కాలువపై ప్రారంభించిన వంతెన నిర్మాణ పనులు పూర్తి కాలేదు. దీనివల్ల ఇబ్బంది పడుతున్నాం. స్థానిక రైతులు కాలువ అవతలి వైపున పంట పొలాల్లోకి వెళ్లాలంటే చుట్టూ తిరగాల్సి వస్తోంది. ముగ్గళ్లకు వెళ్లే ప్రయాణికులు శ్రీరంగపట్నం మీదుగా తిరిగి వెళ్తున్నారు. ప్రజా ప్రతినిధులు శ్రద్ధ వహించి పనులు పూర్తి చేయించాలి.

–గిద్దా సత్యనారాయణ, రైతు నాయకుడు, మునగాల

ఇబ్బందికరంగా ప్రయాణం



మునగాల వంతెన నిర్మాణం పూర్తికాకపోవడం కాలువపై ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు కూడా కొట్టుకుపోవడంతో ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది. మరో ఐదు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. కోరుకొండ, శ్రీరంగపట్నం మీదుగా కొండ పక్కగా మునగాల రావాలి. రాత్రి వేళల్లో ప్రయాణాలకు మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే అనేకమంది ప్రమాదాలకు గురయ్యారు.

–తనకాల ప్రసాద్, శ్రీరంగపట్నం, రైతు నాయకులు

మాకు న్యాయం చేయండి



రంగంపేట తహసీల్దార్ రంజిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

రంగంపేట: ప్రభుత్వం సత్వరం స్పందించి తమకు న్యాయం చేయాలని 104 ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రంగంపేట 104 సిబ్బంది స్థానిక ఎంపీడీఓ సాయిబాబు, తహసీల్దార్ రంజిత్‌కుమార్‌లకు శుక్రవారం వినతి పత్రాలు అందించారు. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, కుటుంబాలను పోషించడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం నుంచి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో 104 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు, డ్రై వర్లు గొర్రెల కాంతారావు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు బత్తిన అనిల్‌కుమార్, జి.మోహన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజమహేంద్రి వైభవం చాటేలా..



నృత్యరూపకం ద్వారా రాజరాజనరేంద్రుని పాలనా వైభవాన్ని చాటుతూ..



కందుకూరి వీరేశలింగం ఆశయాలకు రూపమిచ్చేలా ప్రదర్శన

రాజానగరం: స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతిక సమితి, విజయవాడలోని సెంటర్ ఫర్ ఏపీ స్టడీస్ (కాప్స్) సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం' సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా యూనివర్సిటీలోని కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్న డిప్లమా విద్యార్థులు కొందరు సాంస్కృతిక రాజధానిగా పిలిచే రాజమహేంద్రవరం విశిష్టతను, ఇక్కడి ప్రముఖుల జీవిత విశేషాలను తెలియజేస్తూ ప్రముఖ సినీ కవి ఆరుద్ర రాసిన 'వేదంలా ఘోషించే గోదావరి, అమర ధామంలా శోభిల్లే రాజమహేంద్రి ...' పాటకు అనుగుణంగా ఇచ్చిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. రాజరాజనరేంద్రుని పాలన, ఆలనతోపాటు కందుకూరి వీరేశలింగం ఆశయాలను ప్రతిబింబిస్తూ ఇచ్చిన ఆ ప్రదర్శనను చూసి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినీమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్ సైతం తన్మయుడై, వారిని అభినందించారు.

తాగునీటి సమస్యపై కలెక్టర్ విచారణ



చక్రద్వారబంధంలో తాగునీటి సమస్యపై ఆరా తీస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం: చక్రద్వారబంధంలో తాగునీటి సమస్యపై కలెక్టర్ పి.ప్రశాంతి స్వయంగా విచారణ నిర్వహించారు. గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతోపాటు కుళాయిల నుంచి లీకేజీలతో నీరు వృథాగా పోతుందనే ఫిర్యాదుపై శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించిన ఆమె స్థానికులను ఆరా తీశారు. గ్రామ సచివాలయ సిబ్బంది నుంచి సమస్యకు గల కారణాలను తెలుసుకున్నా సకాలంలో వాటిని పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు.


బోధనా సామర్థ్యాలను పెంచుకోవాలి



శిక్షణను పరిశీలిస్తున్న కోనసీమ డీఈఓ షేక్ సలీం బాషా

రాజానగరం: ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలను పెంచుకోవాలని కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా అన్నారు. మండలంలోని కొండగుంటూరులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఒకటి, రెండు తరగుతులు బోధించే ఉపాధ్యాయులకు జరుగుతున్న రెండో బ్యాచ్ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించేందుకు బోధన జరగాలన్నారు. గ్రేడ్- 1 విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలను సాధించే దిశగా, ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు. శిక్షణలో ఉపాధ్యాయుల చైతన్యాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, రాజమహేంద్రవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి 250 మంది ఉపాధ్యాయులు హాజరవుతున్నారన్నారు. కేఆర్‌పీలు మామిడిశెట్టి రాంబాబు, గంగాధర్, జానకీదేవి పర్యవేక్షణలో డీఆర్పీలు టి.కల్యాణి, షేక్ మగ్బుల్ బాషా, డి.మహేష్, కె.కృపావతి, బి.శంకరావు, వి.ప్రసాద్, జీవీఎస్‌కే గుప్త తదితరులు శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర పరిశీలకుడు అరవ ప్రభాకర్, సీఎంఓ సుబ్రహ్మణ్యం, కో ఆర్డినేటర్ పి.సాయి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి



ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయి మృతి చెందిన వీరరామకృష్ణ

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలో గోదావరి గట్టుపై బూరుగుచెట్టు పుంత రోడ్డులో ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాజానగరం మండలం తోకాడ గ్రామానికి చెందిన ఎస్.వీరరామకృష్ణ (20) ట్రాక్టర్‌పై మొక్కల లోడు వేసుకుని గోదావరి గట్టుపై నుంచి పుంతరోడ్డులోకి దిగేందుకు ప్రయత్నించాడు. అయితే ప్రమాదశాత్తు ట్రాక్టర్ ఇంజిన్ బోల్తా పడింది. దాని కింద వీరరామకృష్ణ ఇరుక్కుపోవడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

రాజానగరం మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీఓ	ఎస్‌జే ఝాన్సీ	96520 77166
తహసీల్దార్	ఎస్.లక్ష్మీలావణ్య	98499 03900
డిప్యూటీ తహసీల్దార్	ఎ.కుమారి	99491 00395
మండల సర్వేయర్	ఇ.అనిత	81794 14568
మండల సివిల్ సప్లయిస్ డీటీ	గొలుగూరి బాపిరాజు	91823 02929
మండల రీసర్వే డీటీ	బి.క్రాంతి	7382 286190
మండల వ్యవసాయాధికారి	ఎస్‌కే ఇమామి ఖాసిం	83310 56550
మండల ఇంజినీర్	సంపత్ కుమార్	98661 35609

పశు గణన షురూ..

- 16 రకాల పెంపుడు జంతువులపై సర్వే
- నిధుల కేటాయింపు కోసమే అంటున్న అధికారులు



రాజానగరంలో పశుగణనను పరిశీలిస్తున్న డీఏహెచ్ఓ శ్రీనివాసు



రైతు కమతంలో పాడి పశువులు

రాజానగరం: నిరంతరం శ్రమిస్తూ పంటలు పండించే అన్నదాతలకు పశు సంపద వెన్నుదన్నుగా నిలుస్తుంది. పూర్వ కాలంలో కర్షకుల ఇళ్ల వద్దే కాకుండా పొలాల్లోనూ పాడి పశువులు, కోళ్లను విరివిగా పెంచేవారు. వేడి నీళ్లకు చన్నీళ్లు సాయమన్నట్టుగా అన్నదాతలకు పశువుల పెంపకం కొంతమేరకు జీవనాధారంగా ఉండేది. ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతు కుటుంబాలకు ఆర్థికంగా ఇది ఎంతగానో ఆసరా ఇచ్చేది. ఈ పశు సంపదతో రైతు కుటుంబాల అనుబంధాలు ఇప్పటికీ అక్కడక్కడా దర్శనమిస్తూనే ఉంటాయి. అంతేకాదు దేశాభివృద్ధిలో కూడా ఈ పశు సంపదకు ప్రత్యేక స్థానం ఉంది. వీటి గణాంకాల ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఉపయోగపడటంతో పాటు పశు సంపద పురోభివృద్ధికి వివిధ రకాల పథకాలను అమలు చేస్తుంటాయి. ఈ క్రమంలో ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 21వ పశుగణన చేపట్టారు.


బృందాలుగా సర్వే

గ్రామాల వారీగా ముగ్గురు సభ్యులతో కూడిన బృందాలను ఏర్పాటు చేసి, పశుగణన సర్వే నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను నియోజకవర్గంలో రెవెన్యూ గ్రామాల్లో బృందానికి ముగ్గురు సభ్యుల చొప్పున పనిచేస్తున్నాయి. వీరు ఇంటింటికీ వెళ్లి, పాడి పశువులు, గొర్రెలు, మేకలతోపాటు 16 రకాల పెంపు జంతువుల వివరాలను సేకరిస్తారు. సర్వేలో సమగ్రమైన వివరాలను సేకరించే విధంగా నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు సహకారంతో రూపొందించిన ప్రత్యేక యాప్‌ను వినియోగిస్తున్నారు. ఇదే సమయంలో వ్యవసాయ పరికరాలు, పాల కేంద్రాల సమాచారాన్ని కూడా సేకరించాల్సి ఉంది. వారం రోజులుగా జరుగుతున్న ఈ గణన వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నాటికి పూర్తి అయ్యేలా అవసరమైన కార్యాచరణను రూపొందించి, అమలు చేస్తున్నారు. సర్వేలో పూర్తి వివరాలు సేకరించిన తరువాత సంబంధిత ఇంటిపై సర్వే పూర్తయినట్టు స్టిక్కర్‌ను అతికించాల్సి ఉంటుంది. గణన చేసిన తరువాత ఆయా పశువులకు ట్యాగ్‌లు కూడా వేస్తారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించే అధికారులు వచ్చినప్పుడు ఆ ఇంటికి అతికించిన స్టిక్కర్‌ని యాప్ ద్వారా పరిశీలిస్తారు. ఈ సమయంలో స్టిక్కర్‌లో ఉన్న సంఖ్యకు, యాప్‌లో కనిపించే సంఖ్యకు సంబంధం లేకుండా ఉంటే సర్వే చేసిన టీమ్‌పై తదనుగుణంగా చర్యలు తీసుకుంటారు. రోజుల తరబడి గణనతోనే కాలక్షేపం చేయకుండా రోజువారీగా చేసే తమ విధులను నిర్వర్తిస్తూనే ఉదయం వేళలో సర్వే చేసే విధంగా కార్యాచరణ చేశారు. ఈ సర్వేలో పశుసంవర్ధక శాఖ గ్రామ సహాయకులతో పాటు గోపాలమిత్రలను కూడా భాగస్వాములను చేశారు.

మండలాల వారీగా..

టీమ్‌కి ముగ్గురు చొప్పున రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో 112 రెవెన్యూ గ్రామాలకుగాను 101 టీమ్‌లను ఏర్పాటు చేశారు. మండలాల వారీగా రాజానగరంలో 17 రెవెన్యూ గ్రామాలకు 6 టీమ్‌లు, సీతానగరంలో 17 రెవెన్యూ గ్రామాలకు 17 టీములు, కోరుకొండలో 19 రెవెన్యూ గ్రామాలకు 19 టీమ్‌లు, అనపర్తిలో 11 రెవెన్యూ గ్రామాలకు 11 టీమ్‌లు, పెదపూడిలో 17 రెవెన్యూ గ్రామాలకు 17 టీమ్‌లు, బిక్కవోలులో 14 రెవెన్యూ గ్రామాలకు 14 టీమ్‌లు, రంగంపేటలో 17 రెవెన్యూ గ్రామాలకు 17 టీమ్‌లు పనిచేస్తున్నాయి. రాజానగరంలో జరుగుతున్న పశుగణన సర్వేని డీఏహెచ్ఓ టి.శ్రీనివాసు సందర్శించారు. సర్వే చేస్తున్న విధానాన్ని పరిశీలించి, సిబ్బందికి కొన్ని సూచనలిచ్చారు. పశుగణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఇది దేశాభివృద్ధికి తోడ్పడుతుందనే విషయాన్ని గ్రహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రైతు ప్రయోజనాల కోసమే..



ప్రస్తుతం చేపట్టిన పశుగణన సర్వే రైతుల ప్రయోజనాల కోసమే. పాడి పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలతోపాటు 16 రకాల పెంపుడు జంతువులను కూడా ఈ సర్వే ద్వారా లెక్కిస్తారు. తదనుగుణంగా పాడి పరిశ్రమ, తదితర వాటి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల కేటాయింపులు ఉంటాయి. ఇదే సమయంలో గతంలో ట్యాగ్‌లు వేయని పశువులకు కూడా ట్యాగ్‌లు వేస్తారు. అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆయా పశువులకు బీమా పరిహారాన్ని అందించడానికి ఇవి ఉపయోగపడతాయి.

–డాక్టర్ ఎంఎస్ఎస్ మూర్తి, సహాయ సంచాలకుడు, రాజానగరం

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అమలుచేసే గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం (పీసీపీఎన్‌డీటీ యాక్ట్) అమలుకు సంబంధించి జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం జిల్లాలో ఉన్న ప్రతి స్కాన్ సెంటర్‌ను నిర్వహించే విధంగా వైద్య ఆరోగ్య శాఖ తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆడైనా మగైనా ఒకటే అనే విషయాన్ని ప్రజలంతా గుర్తించేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు స్కాన్ మెషీన్ ద్వారా గర్భంలో బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికే తప్ప.. ఆడ, మగ అని తెలుసుకోవడానికి కాదని అవగాహన కల్పించాలన్నారు. ఏ స్కానింగ్ సెంటర్లోనైనా లింగ నిర్ధారణ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆడపిల్లల ప్రాముఖ్యతను ప్రజలందరికీ తెలియజేయాలని ఆదేశించారు. మూడు నెలల నుంచి ఇప్పటి వరకు 4 డెకోయ్ ఆపరేషన్లు, 42 స్కానింగ్ సెంటర్ల ఆకస్మిక తనిఖీలు రాజమహేంద్రవరం, కొవ్వూరు అడిషనల్ డీఎంహెచ్‌వోలు నిర్వహించారన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డ్రగ్స్ కంట్రోల్ అడిషనల్ డైరెక్టర్ నాగమణి, జిల్లా స్త్రీశిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి, డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, పోలీస్ శాఖ అధికారి కనకరాజు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై అమీనా బేగం పాల్గొన్నారు.